క్లుప్తంగా

అమ్మవారికి ప్రత్యే పూజలు



ప్రత్యేక అలంకారంలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని బొగ్గలేటిపల్లి – కొత్తపేట సమీపంలోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పట్టు వస్త్రాలతో అలంకరించారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కార్య నిర్వహణ అధికారి పి. సురేష్‌కుమార్‌రెడ్డి అన్ని ఏర్పాట్లను చేశారు. వచ్చిన భక్తులు కానుకలను, ముడుపులను సమర్పించుకున్నారు. ఆలయ ఆవరణలో విందు భోజనాలను చేశారు.

అచ్చవెళ్లి గంగమ్మకు ప్రత్యేక పూజలు

పులివెందుల రూరల్ : మండలంలోని అచ్చవెళ్లి గ్రామ సమీపంలో ఉన్న అచ్చవెళ్లి గంగమ్మకు ఆదివారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు కోరిన కోర్కెలు తీర్చే గంగమ్మతల్లిగా ఎంతో ప్రసిద్ధి గాంచింది. పులివెందుల మండలం నుంచే కాకుండా కర్నూల్, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. దీంతో ఆలయ అర్చకులు కూడా దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశారు.

హెపటైటీస్ బి వ్యాక్సిన్ వేయించుకోండి



ర్యాలీ నిర్వహిస్తున్న అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బంది

జమ్మలమడుగు : హెపటైటీస్ బి వ్యాక్సిన్ వేయించుకుని ఐదు రోగాల బారిన పడకుండా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శాంతికళ తెలిపారు. ఆదివారం ప్రపంచ హెపటైటీస్ డే సందర్భంగా పట్టణంలో ఆమె ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. ఈ వ్యాక్సిన్ వేయించుకోవడం వల్ల జాండ్రీస్, ఫీవర్, కాలేయ సంబంధిత వ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు అవధూత నారాయణ స్వామి ఆరాధన



బ్రాహ్మణపల్లెలోని అవధూత నారాయణస్వామి ఆలయం

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లెలో అవధూత నారాయణస్వామి గుడి వద్ద మంగళవారం నుంచి ఆరాధన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి నారాయణస్వామి సమాధి వద్ద ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేస్తారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులకు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు బ్రాహ్మణపల్లె భజన బృందాల వారిచే భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

సైకాలజిస్టును నియమించాలి

రాజుపాళెం : ప్రతి గ్రామ పంచాయతీలోని ప్రతి పాఠశాలకు ఒక సైకాలజిస్టును నియమించాలని ఆర్‌ఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం పర్లపాడులో మాట్లాడుతూ హత్యలు, ఆత్మహత్యలు, భార్యభర్తలు విడిపోవడం వలన వారికి పుట్టిన పిల్లల జీవితాలు అయోమయంలో పడిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి చిన్న విషయానికి మిస్ బిహేవియర్ వలన ఒకరినొకరు అర్థం చేసుకోవడంలో ఇబ్బందులు పడుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. రకరకాల సమస్యలతో కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మొబైల్ సేవలు అందుబాటులోకి వచ్చినప్పటి విద్యార్థులు మానసిక ఆనందం కోల్పోతున్నారని తెలిపారు. తల్లిదండ్రులు ఏది మంచి ఏది చెడో చెప్పకపోవడంతో ఆకర్షణకు గురవుతున్నారని పేర్కొన్నారు.

ప్రవక్తల త్యాగాలు చిరస్మరణీయం

కడప కల్చరల్ : ప్రవక్తలైన హజరత్ ఇమామ్ హసన్, హజరత్ ఇమామ్ హుస్సేన్ చేసిన త్యాగాలు చిరస్మరణీయమని హజరత్ కంబల్ పోష్ దర్గా పీఠాధిపతి సయ్యద్ అర్షద్ ఇక్బాల్ ఖాద్రి సాహెబ్ తెలిపారు. మొహర్రం మాసం సందర్భంగా ఆదివారం కడప నగరం దండులోని కంబల్ పోష్ నగర్‌లో వెలసిన హజరత్ కంబల్ పోష్ దర్గాలో యాదే హుస్సేన్ పేరుతో ఆధ్యాత్మిక సభ నిర్వహించారు.

సుగంధ పాలముక్కల సాగు.. బహు బాగు

- తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం
- వినూత్న పంటల వైపు యువరైతు చూపు

చింతకొమ్మదిన్నె : వినూత్న పంటల వైపు ఓ యువ రైతు అడుగులు వేశాడు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందేలా సుగంధ పాల పంటను సాగు చేశాడు. మండలంలోని ఇప్పపెంట గ్రామానికి చెందిన అలమూరు శివ అనే యువ రైతు ఒంగోలు, నెల్లూరు జిల్లాల ప్రాంతాల్లో ఈ పంటలను చూసి తాను కూడా ఇలాంటి పంటలను సాగు చేస్తే ఎలా ఉంటుందో అని అడుగులు వేశాడు. దాదాపు ఎకరా పొలంలో ఈ పంటను సాగు చేసి మంచి ఆదాయాన్ని పొందుతున్నాడు.

సుగంధ పాల తయారీ విధానం :
సుగంధ పాల మొక్కలకు వచ్చిన వేర్లను బయటకు తీసి వాటిని ముక్కలు ముక్కలుగా చేసి ఎండబెట్టుకోవాలన్నాడు. బాగా ఎండిన తర్వాత 1/4 కేజీల వేర్లను దంచిపెట్టి కడిగి పెట్టుకోవాలన్నారు. తర్వాత వాటిని ఒక రాత్రి మొత్తం నీటిలో నానబెట్టుకోవాలి. వాటిని ఉడికించే ముందు 1/4 కేజీలకు మూడు లీటర్ల మంచినీళ్లు పోసి బాగా ఉడకబెట్టాలన్నారు. ఉడికిన అనంతరం మూడు లీటర్ల నీళ్లు ఒకటిన్నర లీటర్ల నన్నారిగా తయారు అవుతుంది అన్నారు. ఉడికించిన నన్నారిని ఒక గిన్నెలో పోసి ఒక కేజీ చక్కరను వేయాలన్నారు. తిరిగి వాటిని జిగురుపాకు వచ్చేవరకు ఉడికించాలన్నారు. నన్నారిని ఫ్రిజ్‌లో పెట్టిన, బయటపెట్టిన చెడిపోదన్నారు. ఒకరోజు తర్వాత నన్నారిలో సోడాతో పాటు చల్ల నీరు కలుపుకుని తాగవచ్చని తెలిపారు.



సాగులో ఉన్న సుగంధ పాల మొక్కలు



అమ్మకానికి సిద్ధం చేసిన సుగంధ పాల వేర్లు



సుగంధ పాల మొక్కల విత్తనాలు

పంట పండించే విధానం చాలా సులువు



సుగంధ పాల పంటను పండించే విధానం చాలా సులువు. విత్తనాలను ఒంగోలు నుంచి తీసుకువచ్చాను. ముందుగా వాటిని పశువుల ఎరువులతో మట్టిలో విత్తనాలను నాటాలి. ఒక నెలపాటు ఆ విత్తనాలకు నీళ్లను పట్టి అనంతరం మనం సాగు చేయాలను కున్న భూమిని దుక్కి దున్ని నాటుకోవాలన్నారు. ఒక ఎకరానికి దాదాపు లక్ష రూపాయల వరకు ఖర్చు అవుతుంది.

– అలమూరు శివ, యువరైతు, ఇప్పపెంట, చింతకొమ్మదిన్నె

సుగంధపు వేర్లతోనే షర్బత్ తయారీ



సుగంధపు వేర్లతోనే షర్బత్‌ను తయారు చేస్తారు. ఈ సుగంధపు వెళ్ళు గతంలో కొండ ప్రాంతంలో దొరికేవి. ప్రస్తుతం ఒంగోలు, నెల్లూరు జిల్లాలో ఈ మొక్కలకు సంబంధించిన విత్తనాలు దొరుకుతున్నాయి. పంటకు అయ్యే పెట్టుబడి తక్కువ ఉంటుంది. ఒక కేజీ సుగంధపు వేర్లు మార్కెట్‌లో దాదాపు 700 రూపాయలు పలుకుతోంది.

– బయన్న, రైతు, ఇప్పపెంట, చింతకొమ్మదిన్నె

పుష్పగిరిలో ఏఎఫ్‌యూ వీసీ

ఏఎఫ్‌యూ : పుష్పగిరి పుణ్యక్షేత్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయాన్ని కడప వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య జి. విశ్వనాథకుమార్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శనం చేయించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు పుష్పగిరి స్థలపురాణం, విశిష్టతను వివరించారు. అనంతరం పూజారులు వేదాశీర్వాదం ఇచ్చారు. వైస్ చాన్సలర్ ఆలయంలోని అద్భుతమైన శిల్పకళా సంపదను పరిశీలించారు. ఈయన వెంట వై.అనిల్‌కుమార్ ఉన్నారు.

రెడ్డి సేవా సమితి వార్షిక సమావేశం

కడప కల్చరల్ : కడప నగరం రాజీవ్‌మార్గంలోగల రెడ్డి హాస్టల్‌లోరెడ్డి సేవా సమితి 24వ వార్షిక సమావేశం ఆదివారం నిర్వహించారు. నాగిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి మాట్లాడుతూ సమితి గతంలో నిర్వహించిన కార్యక్రమాలను వివరించారు. రాబోయే కాలంలో చేపట్టబోయే కార్యక్రమాలపై చర్చించారు. కోశాధికారి గుడ్ల ఆదినారాయణరెడ్డి 2023–24 సంవత్సర ఆదాయ, వ్యయ వివరాలను తెలియజేశారు. బడ్జెట్ అంచనాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు, రెడ్డి ప్రముఖులు దేవిరెడ్డి రామచంద్రారెడ్డి, రామసుబ్బారెడ్డి, పద్మప్రియ చంద్రారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రెడ్డికుమారి, వెంకటరెడ్డి, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గండి ఉత్సవాలకు వెలిగల్లు నీటిని తరలించండి

చక్రాయపేట : మరో పది రోజుల్లో ప్రారంభం కానున్న గండి వీరాంజనేయస్వామి శ్రావణ మాస శనివారోత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం పాపాఘ్ని నదికి వెలిగల్లు ప్రాజక్టు నీటిని తరలించాలని చక్రాయపేట జడ్పీటీసీ సభ్యుడు శివప్రసాద్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. పులివెందుల నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, అధికార పార్టీ నేతలు అందరూ ఈ విషయంపై జిల్లా కలెక్టర్, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడాలన్నారు. పాపాఘ్ని నదిలో నీరు లేనందున భక్తుల సౌకర్యార్థం నేతలు ఈ విషయంపై దృష్టి సారించాలన్నారు. నీటిని విడుదల చేయడం వల్ల ఉత్సవాలే కాకుండా పాపాఘ్ని నదీతీర ప్రాంతాల రైతులు నాటిన వరి పంటలకు కూడా ఎంతో మేలు చేకూరు తుందన్నారు. నదికి నీరు వస్తే పిల్లర్లకు నీరు సమృద్ధిగా అంది వరి పొలాలు పండే వరకు నీటి సమస్య తలెత్తదన్నారు.

మానవతసేవలు అభినందనీయం



మానవత సభ్యులను సన్మానిస్తున్న చైర్మన్

వేంపల్లె : మానవత ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ సేవా కార్యక్రమాలు అభినందనీయమని ప్రభుత్వ వెటర్నీ వైద్యులు సాజిద్‌బాషా తెలిపారు. ఆదివారం చైతన్య పాఠశాలలో ఏర్పాటు చేసిన మాసాంతర సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేదలు, అనాథలకు మానవత చేస్తున్న సేవలు చాలా గొప్పవన్నారు. అనంతరం కార్యక్రమంలో మానవత చైర్మన్ చక్రపాణి, సహాయ చైర్మన్ కృష్ణతేజ, కన్వీనర్ రంగారెడ్డి, అధ్యక్షుడు శ్రావణ్, రీజనల్ చైర్మన భాలజీ, డైరెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.

కాలేయ వ్యాధికి నివారణ ఒక్కటే మార్గం

వేంపల్లె : కాలేయ వ్యాధికి నివారణ ఒక్కటే మార్గమని తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు స్వాతిసాయి తెలిపారు.

ఆదివారం ప్రపంచ కాలేయ వ్యాధి దినోత్సవం సందర్భంగా వేంపల్లె దళితవాడలో ఆమె ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. మన శరీరం లోపల అవయవాలలో కాలేయం అతిపెద్ద అవయవం అన్నారు. కణజాలలో కండరాలు పనిచేయడానికి అవసరమైన శక్తిని అందించే గ్లూ కోస్ మోతాదును నియంత్రించడంలో కాలేయం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కాలేయం దెబ్బతింటే శరీరం అంతా కుప్పకూలి పోతుందన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ వెంకటలక్ష్మి, ఏఎన్‌ఎం లక్ష్మిదేవి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



ప్రవచిస్తున్న బ్రహ్మశ్రీ మాల్లాది వెంకట రామనాథశర్మ

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని బ్రహ్మశ్రీ మాల్లాది వెంకట రామనాథశర్మ అన్నారు. స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఆదివారం బ్రహ్మశ్రీ మాల్లాది వెంకట రామనాథ శర్మ శివపురాణం, రామాయణం, భాగవత పురాణాల్లోని శివకల్యాణం, సీతాకల్యాణం, రుక్మిణీ కల్యాణం గురించి ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిదంపతులైన పార్వతీ పరమేశ్వరులు మనకు ఆదర్శమన్నారు. సీతారాములు కుటుంబ ధర్మానికి ఆదర్శంగా నిలుస్తారని, ధర్మాచరణలో భార్యాభర్తలు కలిసి అడుగు వేయాలని సూచించారు. శ్రీకృష్ణుడు సాక్ష్యాత్తు జగద్గురు అయినప్పటికి గృహస్తధర్మానికి ప్రాధాన్యత ఇచ్చి రుక్మిణీ దేవిని వివాహం చేసుకున్నారని తెలిపారు. భార్యాభర్తల దాంపత్యం గురించి, వివాహ వ్యవస్థ ప్రాధాన్యత గురించి వివరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహనరావు, ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డల రవీంద్రబాబు, కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో ఒత్తిడిని అధిగమించవచ్చు

పోరుమామిళ్ల: ప్రాణాయామం, ధ్యానం నిత్యం సాధన చేస్తే ఒత్తిడిని అధిగమించవచ్చని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి.యస్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కస్తూర్బాగాంధీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు యూత్ ఎంపవర్‌మెంట్ సెమినార్ కింద మూడు రోజుల పాటు యోగాపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలిని పీల్చడం వలన రోగాలు దరి చేరవన్నారు. సుదర్శనక్రియ దివ్య ఔషదం లాంటిదని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో యోగా టీచర్లు సాయికిరణ్, బిందు, పురుషోత్తమరెడ్డి, మనోహర్‌రెడ్డి, పాఠశాల పీఈటీ కమల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వర్షం కోసం పూజలు



పెద్దపుత్తలో వర్షం కోసం జాంబవంతునికి పూజలు చేస్తున్న గ్రామస్తులు



కొండాపురం : పెద్దమ్మతల్లికి పూజలు చేస్తున్న గ్రామ ప్రజలు

వల్లూరు : మండలంలోని పెద్దపుత్త గ్రామంలో ఆదివారం వర్షం కోసం పూజలను నిర్వహించారు. వర్షం కురవక పోవడంతో సాగు చేసిన పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో గ్రామ ప్రజలు జాంబవంతునికి పూజలు నిర్వహించారు. ముందుగా గ్రామంలోని శ్రీ యోగా రామాలయం, ఆంజనేయస్వామి ఆలయం, గంగమ్మ ఆలయం, మాతమ్మ ఆలయం, శివాలయాలకు డప్పు వాయిద్యాలతో వెళ్లి పూజలు నిర్వహించి కొబ్బరి కాయలు కొట్టారు. అనంతరం ఆంజనేయస్వామి ఆలయం సమీపంలోని జాంబవంతుని విగ్రహానికి అర్చకులు సూర్యనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రజలు కుటుంబానికి ఒక బిందె చొప్పున నీటిని తెచ్చి జాంబవంతునికి 101 బిందెల నీటితో జలాభిషేకం నిర్వహించారు. వర్షం కురిపించాలని భక్తి శ్రద్ధలతో వేడుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

కొండాపురంలో..

కొండాపురం : ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడిచినా వర్షాలు పడకపోవడంతో ప్రజలు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని బి.కొట్టాలపల్లెలో గంగమ్మకు, పోతులయ్య, పెద్దమ్మతల్లికి బోనాలు సమర్పించారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి



వర్మకల చికిత్స చేస్తున్న డాక్టర్ సాధిక్‌బాషా

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కర్ణాటకకు చెందిన వర్మకళ నిపుణుడు డాక్టర్ సాధిక్ బాషా పేర్కొన్నారు. స్థానిక వసంతపేటలోని శ్రీ చౌడేశ్వరి తొగటవీరక్షత్రియ కల్యాణమండపంలో కల్యాణమండపం, వరల్డ్‌హెల్త్ డెవలప్‌మెంట్ అండ్ హ్యూమన్ రైట్స్‌ఫోరం కర్నాటక ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆకుకూరలు, మాంసం, గుడ్లు, పాలు వంటి మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. శరీరానికి వ్యాయామం చాలా అవసరమని, ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వర్మకళ, ఆక్యుప్రెషర్, ఆక్యుపంక్చర్ వంటి చికిత్సా పద్ధతులతో 300పైగా రోగులకు వైద్యసేవలు అందించారు. బెంగళూరు, హైదరాబాదుకు చెందిన డాక్టర్లు నసీరుద్దీన్, అప్ప, ముసద్దీక్‌పాషా, సుబ్రహ్మణ్యం ఆచారి, సుభాన్, కరిముస్ తదితరులు వైద్యసేవలు అందించారు. మోకాళ్లనొప్పి, నడుంనొప్పి, పక్షవాతం, సయాటిక వ్యాధులకు వైద్య సేవలు చేశారు. కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ కల్యాణ మండప అధ్యక్షుడు బండారు రఘురామయ్య, మనప్రజా సేవాసమితి అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, ఆదరణ స్వచ్ఛంధ సేవాసంస్థ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ, స్నేహసేవా సమితి అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వవిద్యార్థులతో అప్పటి ప్రధానోపాధ్యాయులు

కొండాపురం : మండలంలోని తాళ్లప్రొద్దుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990–91 పదవ తరగతి చదివిన విద్యార్థులు స్థానిక పంక్షన్ హాల్‌లో ఆత్మీయసమ్మేళనం నిర్వహించారు. అప్పటి ప్రధానోపాధ్యాయుడు రామలింగారెడ్డి, గణిత ఉపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి, సైన్స్ ఉపాధ్యాయురాలు జయలక్ష్మిలు హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులను జ్ఞాపికలతో పూర్వ విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని వైద్యులు సూచించారు. ఆదివారం ఫాతిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఫిమ్స్) కళాశాల సెక్రటరీ జవ్వాద్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సల్మాన్ ఆధ్వర్యంలో వెల్లటూరు గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్ పీడియాట్రిక్స్, ఈఎన్‌టీ, డెంటల్, చర్మవ్యాధులు, ఊపిరితిత్తుల సమస్యలు, కంటి వ్యాధులకు సంబంధించి వైద్యులు వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్య సమస్యలు తలెత్తితే సత్వరమే వైద్య సేవలు పొందాలని పేర్కొన్నారు. ఈ శిబిరంలో ఫిమ్స్ వైద్య బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో శాకాహార ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ధ్యానులు, ప్రముఖులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప పిరమిడ్ స్పిరుచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం కడప నగరంలో శాకాహార ర్యాలీ నిర్వహించారు. పోలీసు పిరమిడ్ ధ్యాన కేంద్రం వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ స్థానిక వీధుల మీదుగా సాగింది. ర్యాలీలో ధ్యానులు, నగర ప్రముఖులు పాల్గొని శాకాహారం అమృతాహారమని, శ్రేష్టమైన ఆహారమని నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కడప పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ప్రెసిడెంట్ జీవీఎస్ రెడ్డి, ధ్యానులు, సీనియర్ పిరమిడ్ మాస్టర్లు డాక్టర్ ఊర్మిళాదేవి, గజ్జల రామసుబ్బారెడ్డి, జీవీఎస్ రెడ్డి, ఎంసీ ఓబయ్య, పి.రమణ, సంజీవరాజు, పి.నారాయణరెడ్డి, మురళి, ప్రసాద్, ప్రభాకర్, శర్వాణి, శ్యామల, సరోజ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో కళకళలాడుతున్న వరి పైర్లు

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిన్నదండ్లూరు, ఇల్లూరు, మాలెపాడు, కలమల్ల గ్రామ పంచాయతీలలో వరి పంటలతో ఆ ప్రాంతాలన్నీ ఆహ్లాదకరంగా మారుతున్నాయి. ప్రతి ఎడాది ఈ గ్రామలన్నీ వరి పంటలతో పచ్చని తివాచి పరిచినట్లుగా ఉంది అంటే అతిశయోక్తి లేదని చెప్పవచ్చు. ప్రధానంగా చిన్నదండ్లూరు గ్రామ పంచాయతీ పరిధిలో అధికంగా వరి పంటను సాగు చేస్తుంటారు. మైలవరం దక్షిణ కాలువ నుంచి వచ్చే నీటితో పాటు వ్యవసాయ బోర్లు వరి పంటను సాగు చేస్తుంటారు. ఇలా సుమారు వెయ్యి ఎకరాలకు పైగానే పంట సాగు అవుతుంది. చిన్నదండ్లూరు. పీ గోపులాపురం, కే గోపులాపురం, ఇల్లూరు, మేకలబాయలపల్లి, కలమల్ల, మాలెపాడు గ్రామాలలో వరి పంటను సాగు చేస్తుంటారు. అంతేకాక వరి పంటతో పాటు పత్తి పంటను సాగు చేస్తారు. ఈ పంటలతో దారి పొడవున పచ్చని పంటలు దర్శినమిస్తాయి. రైతున్నలు, వ్యవసాయ కూలీలతో వరినాట్లు రోజు నిండిపోతాయి.



సిద్ధం చేసిన వరి నారు



వరినారును ట్రాక్టర్లలో తీసుకువెలుతున్న రైతు



వరి నాట్లు నాటిన కూలీలు